స్నేహితుని తల్లి వైద్యానికి ఫాబ్ ఆర్థికసాయం

విశాలాంధ్ర - భీమిలి: తమ చిన్ననాటి స్నేహితుడు కోవిడ్ కారణంగా దురదృష్టవశాత్తూ మరణించిన పలుకూరి శ్రీనివాసరావు(క్లబ్ శ్రీను) తల్లికి ఆరోగ్యం బాగోలేదని తెలుసుకున్న ఫ్రెండ్స్ అసోసియేషన్ భీమిలి (ఫాబ్) సభ్యులు తక్షణమే స్పందించి ఆమె వైద్య అవసరాల నిమిత్తం కుమార్తె రాజ్యలక్ష్మికి పదిహేనువేల రూపాయలను అందజేశారు. స్నేహితుడు లేకపోయినా తమ ఇబ్బందులు తెలుసుకుని సహాయం అందించిన ఫాబ్ సభ్యులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ అసోసియేషన్ భీమిలి (ఫాబ్) సభ్యులు కాళ్ళ సన్నీ, మొకర శ్రీరామ్, ముసునూరి సూర్య శ్రీనివాస్, గుగ్గిళ్ళ సాయి, కట్టమూరి రమణరావు, విజ్జపు సత్యనారాయణ, మారోజు గోపి పాల్గొన్నారు.

ఘనంగా బాలాజీ హై ఫీల్డ్స్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - కొమ్మాది: గ్రేటర్ విశాఖ మధురవాడ బాలాజీ హై ఫీల్డ్స్ స్కూల్ వార్షికోత్సవ వేడుక ఆదివారం ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా సింబయోసిస్ టెక్నాలజీ ఫౌండర్ అండ్ సీఈవో ఓరుగంటి నరేష్ కుమార్, పాఠశాల చైర్మన్ మండవ రవికుమార్, డైరెక్టర్ మండవ ప్రణీత్, జనరల్ మేనేజర్ జక్కి అహ్మద్ ఖాన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మజ తదితరులు పాల్గొని ప్రారంభించారు. విద్యార్థుల ప్రతిభను ప్రతిబింబించేలా 'సోల్ ఆఫ్ ఇండియా' అని ప్రత్యేకంగా రూపొందించిన నృత్య కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఓరుగంటి నరేష్ కుమార్ మాట్లాడుతూ బాలాజీ హై ఫీల్డ్స్ స్కూల్ విద్యార్థులు విద్యతోపాటు కళలలో కూడా ముందుండటం ఎంతో అభినందనీయం అని అన్నారు. ముఖ్యంగా దేశభక్తిని రగిలించే సైనిక పాటకు చేసిన నృత్యం, ప్రతి ఒక్కరిలో దేశభక్తి భావాన్ని నింపిందని తెలిపారు. పంజాబీ నృత్యంలో పిల్లలు చూపిన ఉత్సాహం, చురుకుదనం, రంగుల వస్త్రధారణ ఎంతగానో ఆకట్టుకుందని చెప్పారు. అదే విధంగా పుణ్యభూమి (భారతదేశం) గొప్పతనాన్ని ప్రతిబింబించే నృత్యం, భారతదేశం యొక్క ఐక్యత, విభిన్న సంస్కృతుల సమ్మేళనం ఎంత గొప్పదో చాటిచెప్పాయని అన్నారు.

పారిశుద్ధ్య కార్మికులు బాధ్యతగా పని చేయాలి

జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ జోన్-3,4 పరిధిలో ఆర్టీసీ కాంప్లెక్స్, సిరిపురం, సత్యం జంక్షన్, సీతమ్మధర, డైమండ్ పార్క్ తదితర ప్రాంతాల్లో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆకస్మికంగా పారిశుద్ధ్య పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ శానిటేషన్ కార్మికులతో మాట్లాడుతూ పట్టుదల, నిబద్ధత, చిత్తశుద్ధితో విధులను నిర్వర్తించాలని సూచించారు. రాత్రిపూట పారిశుద్ధ్య పనులు నగర పరిశుభ్రత, కాలుష్య నియంత్రణ, ప్రజల ఆరోగ్యం, నగర సుందరీకరణను కాపాడటంలో అత్యంత కీలకమైనదని కమిషనర్ వెల్లడించారు. నగరం ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, అందంగా ఉండేలా బాధ్యతతో పనిచేయాలని పారిశుద్ధ్య సిబ్బందికి కమిషనర్ సూచించారు. కమర్షియల్ ప్రాంతాల్లో రాత్రివేళ చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ, శానిటేషన్ నిబంధనల అమలు పర్యవేక్షణను కమిషనర్ సమీక్షించారు. వ్యాపార దుకాణాల నుండి నిర్దేశిత విధంగా చెత్త సేకరణ జరగడం, సమయానికి వ్యర్థాలను తొలగించడం, రాత్రి సమయంలో శుభ్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించడం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. రాత్రి పూట విధులకు హాజరైన కార్మికుల్లో ఎక్కువ మంది సమయానికి హాజరై పనులు చేస్తుండగా, మొత్తం 375 మందిలో 12 శాతం మంది రాత్రి విధుల్లో గైర్హాజరుగా ఉన్నట్లు గుర్తించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చెత్త తరలింపు వాహనాల కదలికను జాగ్రత్తగా పర్యవేక్షించి, పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దుకాణాల ముందు వ్యర్థాలను పడవేస్తూ నియమాలు ఉల్లంఘిస్తున్న వ్యాపారులను గుర్తించి, రాత్రి పూట "షి" టీమ్స్ (శానిటేషన్ అండ్ హెల్త్ ఎన్ఫోర్స్మెంట్ బృందాల) ద్వారా భారీ జరిమానాలు విధించాలని ఆదేశించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుకపక్కనున్న ప్యాకేజ్-15 పరిధిలో ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన అదనపు కౌంటర్లను తొలగించడం లేదా ప్రతి దుకాణంపై రూ.10,000 జరిమానా విధించేందుకు టౌన్ ప్లానింగ్ విభాగం సహకారంతో తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు కమిషనర్ ఆదేశించారు. రాత్రి శానిటేషన్ వ్యవహారాల బాధ్యతలో ఉన్న ఎస్ఎస్-2 అధికారి రాత్రి 1 గంట సమయంలో ఫీల్డ్‌లో లేకపోవడం, కార్మికుల హాజరు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వాహనాల వివరాలు లేకపోవడంపై కమిషనర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాత్రి శానిటేషన్‌పై పర్యవేక్షణను మరింత బలపరచాలని, పరిశుభ్రత పనుల్లో నిర్లక్ష్యం సహించనని, ప్రతి ప్రాంతం శుభ్రంగా ఉండేలా అధికారులు, సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని ప్రజారోగ్య అధికారులకు టెలిఫోన్ ద్వారా ఆదేశించారు.

పూర్వవిద్యార్థుల సహకారం నిరుపమానం

- ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయం అభివృద్ధికి పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం నిరుపమానమని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. ఆదివారం ఇంజనీరింగ్ కళాశాల వై.వి.ఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన ఏయూ ఇంజనీరింగ్ కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం 11వ వార్షిక సర్వసభ్య సమావేశం- పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ వికాసానికి, మౌలిక వసతుల కల్పనకు పూర్వవిద్యార్థులు విలువైన సహకారాన్ని అందిస్తున్నారన్నారు. ఇంజనీరింగ్ కళాశాల పూర్వవిద్యార్థులు స్వయంగా హాస్టల్ భవన సదుపాయాన్ని కల్పించడం పట్ల సంతోషం వ్యక్తంచేశారు. భవిష్యత్తులో సైతం ఇదే విధమైన సహకారాన్ని విశ్వవిద్యాలయానికి అందించాలని సూచించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిన ఉన్నత విద్యమండలి చైర్మన్ ఆచార్య కె.మధుమూర్తి అనివార్య కారణాల వలన హాజరు కాలేకపోయారు. తమ సందేశాన్ని పంపగా అసోసియేషన్ సీనియర్ సభ్యులు వి.ఆర్.రావు చదివి వినిపించారు. సంస్థ అధ్యక్షులు ఐ.వి.ఎన్.ఎస్.కె.విశ్వనాథరావు మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించడంలో తమ సంఘం సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. అధికారుల దార్శనికతతో సేవలను విస్తృతం చేస్తామన్నారు. హాస్టల్ భవనం నిర్మాణం పూర్తిచేయడానికి పూర్వవిద్యార్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి నాటికి హాస్టల్ భవనం మూడవ అంతస్థు పూర్తిచేసి వర్సిటీకి బహూకరిస్తామన్నారు. సంస్థ కార్యదర్శి ఆచార్య జి.రాంబాబు మాట్లాడుతూ ఏయూ ఇంజనీరింగ్ కళాశాల పూర్వవిద్యార్థుల సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ విద్యార్థులకు ప్రత్యక్షంగా సహకారం, తోడ్పాటు అందించే దిశగా కృషి చేస్తామన్నారు. సంస్థ కోశాధికారి బి.భాస్కరరావు వార్షిక నివేదికను సభ్యులకు వివరించి ఆమోదం పొందారు. అదే విధంగా హాస్టల్ భవన నిర్మాణానికి పూర్వవిద్యార్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రత్యేక అతిథి లాన్సమ్ ప్రాజెక్ట్స్ చైర్మన్, ఏయూ ఇంజనీరింగ్ కళాశాల పూర్వవిద్యార్థి కె.ఉమేష్, రెక్టార్ ఆచార్య పి.కింగ్, మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఆర్.పద్మశ్రీ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా విద్యలో ప్రతిభ కనబరచిన ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు పురస్కారాలు, సర్టిఫికేట్‌లను అతిథుల చేతుల మీదుగా ప్రధానం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరించారు. కార్యక్రమంలో ఏయూ ఆలుమ్ని అసోసియేషన్ సభ్యులు, కళాశాల పూర్వవిద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రూ.13.65 కోట్లతో డైట్ కాలేజ్ ఆధునీకరణ

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) కాలేజీలో రూ.13.65 కోట్లతో ప్రతిపాదించిన ఆధునీకరణ పనులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర విద్యా శాఖ అనుబంధమైన డిపార్ట్మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అండ్ లిటరసీ 2025 - 26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలోని విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు జిల్లా విద్యా శిక్షణ సంస్థల అభివృద్ధికి మొత్తం రూ.43.22 కోట్లు మంజూరు చేసిందని, దీనివల్ల రాష్ట్రానికి విద్యపరంగా ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఆడిటోరియం, రూం తదితర మౌలిక సౌకర్యాల కల్పనకు రూ.4.80 కోట్లు, ఒకొక్కటి రూ.1.80 కోట్లతో రెండు హాస్టల్ భవనాలకు రూ.3.60 కోట్లు, స్మార్ట్ క్లాస్ రూంలు, డిజిటలైజేషన్ కోసం రూ.1.16 కోట్లు, స్టాఫ్ క్వార్టర్స్‌కు రూ.1.03 కోట్లు, క్యాంటీన్, ఫర్నీచర్, స్పోర్ట్స్, రిక్రియేషన్ సదుపాయాలు కల్పనలు రూ.1.68 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. ఈ పనులన్నీ గడువులోపు పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో శాసనమండలి విప్ చిరంజీవిరావు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు, జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, ప్రిన్సిపాల్ లండ సుధాకర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, కూటమి నాయకులు గొలగాని నరేంద్ర, తమ్మిన సూరిబాబు, అనిల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇస్లామిక్ సదస్సులో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

విశాలాంధ్ర - వన్‌టౌన్ : 35వ వార్డు పూర్ణామార్కెట్, పూర్ణాన మసీదు వద్ద ఇస్లామిక్ సదస్సులో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విచ్చేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ని కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని మతాల సారాంశం ఒక్కటే అని, ప్రజలందరూ కలసిమెలసి, ఒకరికొకరు సోదర భావంతో ఉండాలని అన్నారు. దక్షిణ నియోజకవర్గంలో పలు మసీదుల ఆధునీకరణతోపాటు అభివృద్ధికి కృషి చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ముస్లిం సోదరులు స్వేచ్ఛగా వ్యాపారం చేసుకోవచ్చని, ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

బాగా కష్టపడి చదువుకుంటే మంచి భవిష్యత్తు

ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం బి.అప్పలనాయుడు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఏపీఎస్ఆర్టీసీ రీజినల్ మేనేజర్, విశాఖపట్నం బి.అప్పలనాయుడు జన్మదిన వేడుకలను పాపా హెూమ్‌లో చిన్నారులతో కలిసి జరుపుకున్నారు. ఆదివారం ఆయన సీతమ్మధార సందర్శించారు. పాపా హోం పిల్లలకు ఉపదేశించి మాట్లాడుతూ బాగా కష్టపడి చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని, పిల్లలందరూ క్రమశిక్షణ ఇప్పటినుండి అలవాటు చేసుకుని కొనసాగించాలని కోరారు. ఇది ఆదర్శంగా తీసుకొని అందరూ కూడా మరింత మరింత ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పి. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నం కలెక్టరేట్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం - పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కార్యక్రమం జరుగుతుందని, అన్ని శాఖల జిల్లా అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలని చెప్పారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్‌కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోను చెక్ చేసుకోవచ్చన్నారు. అర్జిదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు. అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in వెబ్సైట్‌లో చేసుకోవచ్చని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

స్పైక్స్ -26 టెక్నికల్ సింపోజియం పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇనుస్ట్రుమెంటేషన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న 10వ జాతీయ టెక్నికల్ సిపోజియం స్పైక్స్ -26 పోస్టర్‌ను ఏయూ వైస్ చాన్సలర్ ఆచార్య జి.పి.రాజశేఖర్ తన కార్యాలయంలో విడుదల చేశారు. మార్చి 11 నుంచి 13వ తేదీ వరకు మూడు రోజులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. టెక్నికల్ పేపర్ ప్రజెంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, వర్క్ షాప్స్ మొదలైనవి దీనిలో నిర్వహిస్తారు. దేశం నలుమూల నుంచి ఇంజనీరింగ్ విద్యార్థులు, పరిశోధకులు టెక్నికల్ సింపోజియంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పి.స్వప్న, కన్వీనర్ ఎం.రమేష్ పట్నాయక్, సహ కన్వీనర్ డాక్టర్ ఏ.డైసీ రాణి, విద్యార్థి కో- ఆర్డినేటర్ ఏ.శశికాంత్, ప్రోడమిక్ టెక్నాలజీస్ నిర్వాహకులు రాకేష్, ఆదిత్య, మూడవ సంవత్సరపు ఇంజినీరింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

14న రాష్ట్ర నాగవంశీయుల వనభోజనాలు

విశాలాంధ్ర - భీమిలి: ఈ నెల 14న రాష్ట్ర నాగవంశీయుకుల వన భోజనాలు తాళ్లవలస లెజెండ్‌లో జరుగుతుందని రాష్ట్ర నాగవంశ సంఘం అధ్యక్షులు గాడు అప్పలనాయుడు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గాడు అప్పలనాయుడు మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ ఆదివారం జరగనున్న కుల వనభోజనాలు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం, భీమిలి, తగరపువలస, పద్మనాభం, ఆనందపురం నాగావంశీయులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా కమిటీ ఏర్పాటుకు అభిప్రాయ సేకరణ

విశాలాంధ్ర - ఆనందపురం: బీజేపీ విశాఖ జిల్లా కిసాన్ మోర్చా కమిటీ ఏర్పాటుకు నూతన అధ్యక్షుడు పి.వి.కృష్ణారావు అధ్యక్షతన మొదటి సమావేశాన్ని నిర్వహించారు. ఆనందపురం వెల్లంకి మండల బీజేపీ కార్యాలయంలో ఆదివారం కిసాన్ మోర్చా కార్యకర్తలతో చర్చించి అభిప్రాయ సేకరణ చేశారు. మాజీ జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షులు పి.వి.వి.ప్రసాదరావు పట్నాయక్ మాట్లాడుతూ బిజెపి పార్టీకి పనిచేసే వారికి, కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ పథకాలను ప్రతి రైతుకి చేరేలా ప్రచారం చేసే కార్యకర్తలకు మాత్రమే జిల్లా కమిటీలో తీసుకుంటారని సూచించారు. బిజెపి సీనియర్ నాయకులు కార్యకర్తల అభిప్రాయ సేకరణ అనంతరం అధ్యక్షుడు కృష్ణారావు మాట్లాడుతూ రైతుల సంక్షేమం పట్ల కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామ గ్రామాన ప్రతి రైతుకు చేరేలా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పి.వి.ఎన్.మాధవ్, విశాఖపట్నం జిల్లా బిజెపి అధ్యక్షుల పరశు రామరాజు ఆదేశానుసారం పార్టీకి సైనికుడిలా పనిచేసి రైతుల అభివృద్ధికి పాటుపడే వ్యక్తులను జిల్లా కమిటీలో నియమించనున్నట్లు పేర్కొన్నారు. విశాఖపట్నం జిల్లాలో వ్యవసాయ ఆధారిత మండలాలైన ఆనందపురం, పద్మనాభం, భీమిలి రూరల్ మండలాల కార్యకర్తలకు జిల్లా కమిటీలో తగిన ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు అధ్యక్షులు కృష్ణారావు తెలిపారు. కార్యకర్తలకు పి.వి.కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నూతన అధ్యక్షునికి కిసాన్ మోర్చా నాయకులు, కార్యకర్తలు దుశ్శాలువతో సత్కరించారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఉప్పాడ అప్పారావు, జిల్లా కిసాన్ మోర్చా మాజీ అధ్యక్షులు పి.వి.వి.ప్రసాదరావు పట్నాయక్, కిసాన్ మోర్చా జిల్లా నాయకులు కామేష్ అయ్యగారి, విశ్రాంత వెటర్నరీ వైద్యులు డి.ఆర్.కె.రాజు, సిరికి సత్యనారాయణ, ఆనందపురం మండల బిజెపి ప్రధాన కార్యదర్శి డి.పి. రాజు, పద్మనాభం మండల బిజెపి ఉపాధ్యక్షులు మత్స సోమేశ్వరరావు, మండల బిజెపి యువ మోర్చా మాజీ అధ్యక్షులు హంస మహేష్, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారిని ఆదివారం ప్రముఖ క్రికెటర్ విరాట్ కోహ్లీ, ఆయన కుటుంబ సభ్యులు, ఆసియా కప్ టీమిండియా మాజీ మేనేజర్ పి.వెంకట రామ్ ప్రశాంత్, టీమిండియా ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్, ఫీల్డింగ్ కోచ్ దిలీప్, ఏసీఏ ప్రతినిధి విష్ణు, సినీనటుడు ఆది, శంబాల చిత్రం టీం దర్శించుకున్నారు. వీరిని దేవస్థానం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సింగం రాధ, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వర్‌రావు, పర్యవేక్షణ అధికారి కంచి మూర్తి పూల మాలలు వేసి స్వాగతం పలికారు. తొలుత వీరు కప్పస్తంభం ఆలింగనం చేసుకుని స్వామివారికి తమ గోత్ర నామాలతో సంకల్పం చెప్పించారు. దర్శనం అనంతరం వేదపండితులు ఆశీర్వచనం పలికారు. ఏఈఓ వారికి స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కుక్క మాంసంతో వ్యాపారమా...?

- ప్రజల గుండెల్లో అలజడి
- రోడ్డు పైనే కుక్కల కళేబరాలు
- మటన్‌లో కలుపుతున్నారనే అనుమానం

విశాలాంధ్ర - ఆనందపురం: మానవుల పరిస్థితి రోజురోజుకి మారుతున్నది అనడానికి ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. చికెన్ మటన్ ఇష్టంగా యుదేచ్ఛగా తింటున్నారు. అయితే ఇదే అదునుగా చూసుకొని వ్యాపారస్తులు ఒక కొత్త వ్యాపారానికి తెర తీశారు. కొత్త వ్యాపారం అన్న పదానికి నిర్వచనంగా ఆనందపురం మండలం సత్తరవు జంక్షన్ వద్ద 5 కుక్కల కళేబరాలు దర్శనమిస్తున్నాయి. పూర్తిగా చర్మం ఎముకలతో ఉండినటువంటి కుక్కలను గోనె సంచుల్లో పెట్టి స్థానిక జంక్షన్లో పడవేసినట్లు చెబుతున్నారు. అయితే ఎముకల నుంచి వేరు చేసిన కుక్కల చర్మంను ఏమి చేస్తున్నారనేది సందేహంగా మిగులుతుంది. అయితే కొంతమంది ఈ విషయంపై కుక్క మాంసం కూడా మేక మాంసంతో కలిపి క్రయవిక్రయాలు జరుపుతున్నారని ఈ మధ్యకాలంలో కుక్కలు కూడా రోజురోజుకి అంతరించిపోతున్నాయని ఈ సందర్భంగా చెబుతున్నారు. ఏదేమైనప్పటికీ కుక్కల్ని చంపడమే నేరం.. దానికి తోడు మాంసాన్ని విక్రయించి ఇష్టానుసారంగా వ్యాపారాలు సాగించిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని అలాగే కుక్క మాంసం కల్తీ చేయడం వల్ల ఆరోగ్యం సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎప్పుడూ లేనివిధంగా ఇలాంటి కొత్త విషయాలు బయటకు రావడం కుక్కల్ని హరించడం వంటివి సామాజిక మాధ్యమాల్లో చెక్కర్లు కొట్టడం చర్చనీయాంశంగామారింది. అయితే ఈ విషయంపై స్థానిక ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని పోలీసులు తక్షణమే సీసీ కెమెరాలు పరిశీలించి ఈ ఘాతుకానికి పాల్పడిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సంక్షోభంలో విమానయాన రంగం

- విఫలమైన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు
- మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: తీవ్ర సంక్షోభంలో విమానయాన రంగం ఉందని మాజీ మంత్రి, అనకాపల్లి జిల్లా వైసీపీ అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్ అన్నారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్‌ల (ఎఫ్‌డీటీఎల్) అమలు చేయడం వల్ల తలెత్తిన ఇబ్బందులను గుర్తించి, పరిష్కరించలేకపోయిన పౌర విమానయాన శాఖ వైఫల్యం వల్లే ఫ్లైట్స్ రద్దయి లక్షలాది మంది ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నాని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు ప్రయాణికులు ఇబ్బంది పడుతుంటే మరోవైపు ఈ సమస్యను లోకేష్ వార్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నా దంటూ టీడీపీ అధికార ప్రతినిధులు జాతీయ మీడియాలో చేసిన కామెంట్లతో దేశంలో తెలుగువాడి పరువు, ప్రపంచంలో దేశం పరువు మంట గలిసిందని ఆక్షేపించారు. ఇండిగో ఎయిర్ లైన్స్ సమస్య పరిష్కారంలో విఫలమవడంతోపాటు, ఇష్టమొచ్చినట్లు టిక్కెట్లు రేటు పెంచిన విమానయాన సంస్థలను అదుపు చేయడంలోనూ కేంద్రమంత్రి విఫలమయ్యారని తేల్చి చెప్పారు. తక్షణమే సమస్య పరిష్కారానికి కృషి చేసి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. విమానయాన రంగంలో వచ్చిన సంక్షోభాన్ని మా నేత లోకేష్ పర్యవేక్షిస్తున్నారని టీడీపీ అధికార ప్రతినిధులు జాతీయ మీడియాలో మాట్లాడుతున్నారని, అసలు లోకేష్‌కి కేంద్ర పౌరవిమానయాన సంస్థకు ఏమి సంబంధం అని ఆయన ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మొత్తం 9500 మందిని ఉద్యోగాల నుంచి తొలగించారని, 42 విభాగాలను ప్రైవేటుపరం చేసి.. స్థానిక కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి ఇలాంటి అంశాల మీద దృష్టిపెట్టాలని, విశాఖకు గర్వకారణమైన స్టీల్ ప్లాంట్‌ను కాపాడే ప్రయత్నం చేయాలని కోరుతున్నానన్నారు. సమావేశంలో మాజీ శాసన సభ్యులు చింతలపూడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సేఫ్ హార్బర్ హౌసింగ్ కాలనీ నివాసితుల సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

విశాలాంధ్ర - తగరపువలస: భీమిలి మండలం నేరెళ్ల వలస గ్రామానికి చెందిన సేఫ్ హార్బర్ హౌసింగ్ కాలనీ నివాసితుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎస్.రవీంద్రబాబు, ఉపాధ్యక్షులుగా కే.రామచంద్ర రావు, ఎం.శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2006లో ఈ హౌసింగ్ కాలనీని సముద్ర సునామి పునరావాస కార్యక్రమంలో భాగంగా యుసిఎస్ డబ్ల్యూఏ ట్రస్ట్ వారు నిర్మించారు. అప్పటి నుండి కాలనీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సదరు ట్రస్టు ద్వారా నిర్వహించబడుతున్నాయి. కాలనీ నివాసితుల ఐక్యత భద్రతలను బలోపేతం చేయడం, రహదారులు, వీధి దీపాలు త్రాగునీరు వంటి పౌర సౌకర్యాలను కల్పించడం, బలహీన వర్గాల సంక్షేమ కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడం, ప్రభుత్వం, అధికార సంస్థలతో సమన్వయం చేసుకుంటూ కాలనీ అభివృద్ధి పనులు వేగవంతం చేయడం, కాలనీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామని నూతన కార్యవర్గం తీర్మానించారు. ఈ నూతన సంఘానికి కార్యదర్శిగా ఎం.జగన్ మోహన్ నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బి.అప్పలనాయుడు, ఎస్.సునీల్ కుమార్‌లు, కార్యవర్గ సభ్యులుగా పదిమందిని ఎన్నుకున్నారు.

ఘనంగా 26 ఏళ్ల మిలీనియం ఘన వార్షికోత్సవం

విశాలాంధ్ర- విశాఖపట్నం: "భవిష్యత్తు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా నడుస్తోంది. అందుకు మనం సిద్ధంగా ఉండి, అవసరమైన నైపుణ్యాలను పొందాలి" అని పాత్రా ఇండియా బిపిఓ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మి ముక్కవిల్లి మిలేనియం ఆప్టిట్యూడ్ కోడింగ్ టెస్ట్-2025 బహుమతి ప్రదాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని పేర్కొన్నారు. ట్రెండింగ్ టెక్నాలజీలను క్రమశిక్షణతో నేర్చుకుంటే ఉద్యోగావకాశాలు ఎంతో ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. ఎంఎసిటీ వంటి పరీక్షలు విద్యార్థుల్లో పోటీ భావనను పెంచుతాయని కూడా అభిప్రాయపడ్డారు. ఎవరూ ఎదగడానికి ఎదురు చూసి సిద్ధం కాలేదు. ప్రారంభించడం ద్వారా మాత్రమే సిద్ధత వస్తుంది" అని వరదా రవికుమార్, సెంట్రల్ మేనేజర్, మిల్లేనియం సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ ప్రారంభ ప్రసంగంలో చెప్పారు. ఈరోజు కార్యక్రమం మిల్లేనియం సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ 26వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించబడుతోందని పేర్కొన్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన శిక్షణతో పాటు ప్లేస్మెంట్ సహాయంపై మిల్లేనియం ఎల్లప్పుడూ దృష్టి పెట్టిందని వివరించారు. సిఆర్ టీ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, 2023లో మిల్లీనియం ఆప్టిట్యూడ్ టెస్ట్ను 50 లక్షల రూపాయల ప్రతిభా వేతనంతో ప్రారంభించామని, ఇందులో ఇంగ్లీష్, లాజికల్ రీజనింగ్, వర్బల్, ప్రాబ్లమ్ సాల్వింగ్, కంప్యూటర్ ఫండమెంటల్స్ వంటి ఇంటర్వ్యూలో కీలకమైన నైపుణ్యాలను పరీక్షించుకోడానికి విద్యార్థులకు అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈ సంవత్సరం మిల్లేనియం ఆప్టిట్యూడ కోడింగ్ టెస్ట్ 30 కళాశాలల్లో విజయవంతంగా నిర్వహించబడిందని, మొత్తం 5,500 మంది విద్యార్థులు పాల్గొన్నారని, అందులో 1,000 మంది ర్యాంకర్లుగా ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమం నిర్వహణలో సహకరించిన విశాఖ పరిసర ప్రాంతాల ప్రఖ్యాత కళాశాలల ప్రిన్సిపాళ్లు, హెచ్ ఓ డీ, టిపిఓ లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మరిసెట్టి డింపుల్ (ఎన్నారై ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) మొదటి ర్యాంక్ సాధించి రూ. 50,000 నగదు బహుమతి గెలుచుకున్నారని ప్రకటించారు. 2వ ర్యాంక్ వెమనమంద శ్రీ సాయి ప్రణవ్ వర్మ (ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్), 3వ ర్యాంక్ బెజవాడ నూక శ్రీనివాసరావు (ఏ ఎస్ కే కాలేజ్ ఆఫ్ టెక్

%ఉ% మేనేజ్మెంట్), 4వ ర్యాంక్ షేక్ కరీముల్లా (ఎం వి ఆర్ డిగ్రీ కాలేజ్), 5వ ర్యాంక్ చింతల గణేష్ (సెంచూరియన్ యూనివర్సిటీ) తరువాత, బేప్రో కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ సీ ఎస్ ఈ విభాగాధిపతి నారాయణరావు చౌక్కాపు మాట్లాడుతూ ఏఐ పరిశ్రమల్లో విస్తరిస్తున్నప్పటికీ, దాన్ని అమలు చేయడానికి ఇంజనీర్లు అవసరమని, విద్యార్థులు తాజా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఎంవిఆర్ డిగ్రీ కాలేజ్ ఫ్యాకల్టీ బి. రత్నకుమార్, విశాఖ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్ ఫిజిక్స్ హెచ్ఓడీ డాక్టర్ పి.ఎల్. సరణ్య తదితరులు మిలేనియం 26 ఏళ్ల విజయవంతమైన ప్రయాణాన్ని కొనియాడారు. వి ఐ ఈ టి, సెయింట్ ఆన్స్, బి వి కే డిగ్రీ కాలేజీల ప్రతినిధులు కూడా ఈ ఉపయోక్తమైన పరీక్ష నిర్వహణకు మిలేనియంను అభినందించారు. తర్వాత ముఖ్య అతిథి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేయడం జరిగింది.

నగరంలో అనధికార నిర్మాణాలను ఉపేక్షించం

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: ప్రభుత్వం విడుదల చేసిన బిపిఎస్ పథకంలో నమోదుకై పలు భవనాల నిర్మాణదారులు అనధికారికంగా భవనాలు, భవనాలపై అదనపు అంతస్తులు నిర్మాణాలు జరుపుచున్నారని, వాటిని గుర్తించి టౌన్ ప్లానింగ్ విభాగం నిరంతర ప్రక్రియ జరుపుతూ పలు అనధికారిక నిర్మాణాలను కూల్చివేయడం జరుగుచున్నదని, ఎల్.ఆర్.ఎస్, బి.పి.ఎస్. పథకాలను సక్రమంగా వినియోగించుకుంటూ భవనాల యజమానుదారులు వారి భవనాలను క్రమబద్ధీకరించుకోవాలని, నగరంలో అనధికార నిర్మాణాలను ఉపేక్షించమని జీవీఎంసీ యంత్రాంగం వాటిని గుర్తించేందుకు నిరంతర నిఘా ప్రక్రియ జరుపుతోందని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదివారం తెలియజేశారు. విశాఖ నగర పరిధిలో అనధికార నిర్మాణాలను, అదనపు అంతస్తుల నిర్మాణాలను చేపడితే ఉపేక్షించమని, అటువంటి వాటిని గుర్తించి వెంటనే జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం తొలగించే కార్యక్రమాలు చేపట్టిందని కమిషనర్ తెలిపారు. ఇప్పటికే బిపిఎస్ పథకంలో అక్రమ నమోదు కొరకు అనధికార నిర్మాణాలను, అదనపు అంతస్తులను నిర్మిస్తున్న పలు భవనాలను టౌన్ ప్లానింగ్ విభాగం గుర్తించి కూల్చి వేయడం జరిగినదని, జోన్ - 4 పరిధిలో వార్డు 29 లో ప్రకాశరావుపేట డోర్ నెంబర్ 12-55- 1, 2 మూడవ అంతస్తు అనధికారిక నిర్మాణాన్ని, వార్డు 31 చాకలిపేటలో, గాజువాక శ్రీనగర్‌లో అనధికారిక అదనపు అంతస్తులను కూల్చి వేయడం జరిగిందని సిసిపి

ఏ.ప్రభాకర్‌రావు తెలియజేశారు. కావున అటువంటి అనధికార నిర్మాణాలకు భవనాల యజమానుదారులు, బహుళ అంతస్తుల యజమానుదారులు, ప్రజలు పాల్పడరాదని కమిషనర్ హెచ్చరించారు. ప్రభుత్వం కల్పించిన ఎల్.ఆర్.ఎస్, బి. పి. ఎస్. పథకాలను 2025 ఆగస్టు 31 లోపున నిర్మించిన అనధికార నిర్మాణ భవనాల యజమానులు, బహుళ అంతస్తుల నిర్మాణదారులు సంబంధిత భవనాలను, అంతస్తులను క్రమబద్ధీకరించుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలన్నారు. 2025 ఆగస్టు 31వ తేదీ తర్వాత నిర్మించిన అనధికార భవన నిర్మాణాలు, ప్రస్తుతం అనధికారికంగా జరుపుచున్న నిర్మాణాలు బిపిఎస్ పథకంలోనికి వర్తించవన్నారు, ఎల్ఆర్ఎస్, బిపిఎస్ పథకాల సదవకాశాన్ని సద్వినియోగ పరుచుకునేందుకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయం టౌన్ ప్లానింగ్ విభాగం ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసిందని, హెల్ప్ డెస్క్ ఫోన్ నెంబర్లు 9154282649, 9154282654కు ఫోన్ చేయడం ద్వారా గాని, లేదా గుర్తింపు పొందిన లైసెన్సు టెక్నికల్ పర్సన్స్ ద్వారా 2025 ఆగస్టు 31వ తేదీ లోపున నిర్మించిన మీ యొక్క అనధికార భవనాల కట్టడాలను క్రమబద్ధీకరించుకునే ప్రక్రియకు ముందుకు రావాలని, నిర్ణీత కాలంలో ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని, భవనాల యజమానుదారులకు, ప్రజలకు కమిషనర్ సూచించారు. నగరంలో అనధికార కట్టడాలు, భవన నిర్మాణాలు జరుగుచున్నట్లయితే వెంటనే జీవీఎంసీ టోల్ ఫ్రీ నెంబర్ 1800 4250 0009 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారాన్ని తెలియచేయవచ్చునని కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

వడివడిగా దక్షిణ కోస్తా రైల్వే దిశగా...

- విశాఖపట్నం డివిజన్ ఉద్యోగులకు వరం

- రైల్వే కార్మిక నేత చలసాని గాంధీ

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: గెజిట్ నోటిఫికేషన్ లాంఛనం మినహా మిగిలిన ఏర్పాట్లు అన్నీ ఎన్డీయే కూటమి ప్రభుత్వం చొరవతో విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోను సాకారం దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్, కేంద్ర మంత్రులు, పార్లమెంటు సభ్యుల చొరవతో ఏర్పడుతున్న కొత్త రైల్వే జోన్ ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రాన్ని ముఖ్యంగా వెనుకబడిన ఉత్తరాంధ్ర భవిష్యత్తుని మార్చివేయనుందని సీనియర్ రైల్వే జాతీయ కార్మిక నాయకులు, దక్షిణ కోస్తా రైల్వే జోన్ పోరాట సాధన సమితి వ్యవస్థాపక కన్వీనర్, డిఆర్‌యుసీసీ వాల్తేర్ డివిజన్ సభ్యులు చలసాని గాంధీ ఒక ప్రకటనలో తెలియజేశారు. శతాబ్దానికి పైగా విశేష చరిత్ర కలిగి సరుకు రవాణాలో దేశంలోనే అత్యద్భుత సామర్థ్యం కనబరుస్తున్న వాల్తేర్ డివిజన్‌ని కాపాడటం చాలా గొప్ప విషయంగా చెప్పవచ్చు. తన నియోజకవర్గం ఉన్న వాల్తేర్ డివిజన్‌ని విశాఖపట్నం డివిజన్‌గా కొనసాగించడంలో స్థానిక ఎంపీ శ్రీభరత్ పాత్ర చాలా కీలకంగా మారిందన్నారు. విశాఖపట్నం డివిజన్ మనుగడలో లేకపోతే వందలాది మంది స్థానిక రైల్వే ఉద్యోగులు అటు విజయవాడ డివిజన్‌కి గానీ, ఇటు రాయగడ నూతన డివిజన్‌కి గానీ ఖచ్చితత్వంగా వెళ్ళాల్సివచ్చేది. ఇప్పుడు ఆ ఇబ్బంది తప్పిందన్నారు. ఈ విషయంలో రైల్వే కార్మిక లోకం కూటమి ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు అందరికీ రుణపడి ఉంటుంది. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయానికి సాధారణ పరిపాలన, అకౌంట్స్, కమర్షియల్, ఇంజనీరింగ్, ఎలక్ట్రిక్, ఆపరేటింగ్, మెకానికల్, మెడికల్, పర్సనల్, సిగ్నల్ టెలికాం, స్టోర్స్, సెక్యూరిటీ విభాగాలకు చెందిన 1100 పోస్టులు అవసరం అవుతాయి. విశాఖపట్నం కొత్త జోనల్ కార్యాలయంలో రాయగడ కొత్త డివిజన్‌లో పనిచేయడానికి రైల్వే బోర్డు ఈనెల 2న ఇచ్చిన అదేశాల్లో 15 రోజుల్లో ఉద్యోగుల నుంచి ఆప్షన్స్ కి ముసాయిదా తయారు చేయమని తూర్పు కోస్తా, దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్లను ఆదేశించింది. ఈ అదేశంలో కొత్త జోన్ నోటిఫికేషన్ జారీ లాంఛనమే మిగిలి ఉందని స్పష్టంగా పేర్కొంది. కొత్త కార్యాలయాల్లో పనిచేయడానికి ప్రస్తుత ఉద్యోగులు ముఖ్యంగా దేశవ్యాప్తంగా ఉన్న తెలుగు రాష్ట్రాల రైల్వే ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు రావొచ్చు. విశాఖపట్నం జోనల్ కార్యాలయంలో పనిచేసేందుకు మొదటి ప్రాధాన్యత తూర్పు కోస్తా (భువనేశ్వర్) ,దక్షిణ మధ్య రైల్వే (సికింద్రాబాద్) జోనల్ కార్యాలయ ఉద్యోగులు, రెండో ప్రాధాన్యత ఖుర్దా, సంబల్పూర్, నాందేడ్, సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్ల ఉద్యోగులకు ఉంటుంది. తృతీయ ప్రాధాన్యత విజయవాడ,గుంటూరు, గుంతకల్లు, విశాఖపట్నం డివిజన్ల ఉద్యోగులకు మిగతా దేశవ్యాప్త ఉద్యోగులకు ఉంటుంది. ఈ క్రమంలో రాయగడ డివిజన్ డి ఆర్ ఎమ్ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది కి ఆప్షన్స్ కోరనున్నారు. ఒరిస్సా రాష్ట్రీయులు, ఆంధ్రప్రదేశ్ లో విజయనగరం నుంచి రాయగడ, పలాస, ఇచ్ఛాపురం, బరంపురం వాసులు కొత్త డివిజన్లో లభించే పదోన్నతి అవకాశాల దృష్ట్యా రాయగడ డివిజన్ ని ఎంపిక చేసుకుంటే , విశాఖపట్నం డి ఆర్ ఎమ్ కార్యాలయం నుంచి రాయగడ కి వెళ్లే ఉద్యోగుల సంఖ్య కొంత మేర తగ్గవచ్చు. ఇతర డివిజన్ల నుంచి విశాఖపట్నం రావడానికి కొందరు ఉద్యోగులు అనాసక్తి ప్రదర్శిస్తే ఆ మేరకు జోనల్ కార్యాలయంలో స్థానిక ఉద్యోగులకు అవకాశం రావొచ్చు. కీలకమైన ఈ సమయంలో ఉద్యోగులు పూర్తి సంయమనం పాటించి రైల్వే యాజమాన్యానికి సంపూర్ణ సహకారం అందించి , గుర్తింపు కార్మిక సంఘాల ద్వారా చర్చల ద్వారా అన్నీ సమస్యలు పరిష్కరించుకోవచ్చు. గతంలో 9 నుంచి 16 జోన్లు ఏర్పడినప్పుడు, సంబల్పూర్, రాయపూర్ కొత్త డివిజన్లు ఏర్పడినప్పుడు మెజార్టీ ఉద్యోగులకు మేలు జరిగేలా కార్మిక-యాజమాన్యాల మధ్య సమన్వయం చేసిన విశేష అనుభవం ఉన్న సీనియర్ రైల్వే కార్మిక నాయకుల ఈ నూతన అధ్యాయంలో కీలక పాత్ర పోషించనున్నారు.

క్రోమాలో ఎయిర్ ప్యూరిఫైయర్‌కు డిమాండ్

విశాలాంధ్ర - విశాఖపట్నం: టాటా గ్రూప్ నుండి భారతదేశం యొక్క విశ్వసనీయ ఓమ్ని ఛానల్ ఎలక్ట్రానిక్స్ రిటైలర్ అయిన క్రోమా, ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ ఛానెల్‌లలో 2025 అమ్మకాల డేటా ఆధారంగా ఎయిర్ ప్యూరిఫైయర్ కొనుగోళ్లపై అంతర్దృష్టులను విడుదల చేసింది. డిమాండ్ ఎక్కడ ఉద్భవించింది.

అభివృద్ధి చెందుతున్న కస్టమర్ ప్రాధాన్యతలను మరియు కొనుగోలు నిర్ణయాలపై డిజైన్, సాంకేతికత యొక్క పెరుగుతున్న ప్రభావాన్ని అధ్యయనం హైలైట్ చేస్తుంది. నివేదిక ప్రకారం, ఢిల్లీ ఎన్‌సీఆర్ క్రోమా వద్ద జరిగిన మొత్తం ఎయిర్ ప్యూరిఫైయర్ అమ్మకాలలో 72 శాతం వాటాను కలిగి ఉంది, ఇది నిరంతర గాలి నాణ్యత సవాళ్లకు ఈ ప్రాంతం యొక్క ప్రతిస్పందనను ప్రతిబింబిస్తుంది. మహారాష్ట్ర 12 శాతం మరియు కర్ణాటక 4 శాతం సహకారం అందించాయి.

ఇది ఇతర రాష్ట్రాల్లో కూడా పెరుగుతున్న అవగాహన మరియు దత్తతని సూచిస్తుంది.

ధూళి, పుప్పొడి మరియు అచ్చు వంటి గాలిలో ఉండే కణాలను తొలగించగల నిరూపితమైన సామర్థ్యానికి ధన్యవాదాలు, హెచ్ ఈ పీ ఏ ఫిల్టర్‌లు కస్టమర్‌లకు అగ్ర ఎంపికగా ఉన్నాయి. చాలా మంది దుకాణదారులు కాలుష్య కారకాలు మరియు వాసనలకు వ్యతిరేకంగా సమగ్ర రక్షణ కోసం బహుళ-లేయర్డ్ రక్షణ-కలిపే ప్రీ-ఫిల్టర్‌లు, యాక్టివేటెడ్ కార్బన్ ఫిల్టర్‌లు మరియు యువిసి ఎల్ఈడి టెక్నాలజీని కలిగి ఉన్న అధునాతన మోడల్‌లను కూడా ఎంచుకున్నారు.

ఎయిర్ ప్యూరిఫయర్‌లు ఇకపై సముచిత లేదా కాలానుగుణ ఉత్పత్తులుగా చూడబడవు, అవి ముఖ్యంగా ఢిల్లీ ఎన్ సీ ఆర్ వంటి నగరాల్లోని కస్టమర్‌లకు ఏడాది పొడవునా అవసరమైనవిగా మారాయి. క్రోమాలో, గది పరిమాణం, బడ్జెట్ మరియు ఆరోగ్య అవసరాల ఆధారంగా సరైన ప్యూరిఫైయర్‌ను ఎంచుకోవడంలో కస్టమర్‌లకు మార్గనిర్దేశం చేయడంపై దృష్టి పెట్టినట్టు ఆ సంస్థ ప్రతినిధి వెల్లడించారు.

ట్రాఫిక్ బారికేడ్లను పోలీసులకు అందజేసిన మాక్సివిజన్ ఐ హాస్పిటల్

విశాలాంధ్ర - విశాఖపట్నం: నగరంలోని మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్స్ విశాఖపట్నం నగర ట్రాఫిక్ పోలీసులకు కొత్తగా రూపొందించిన ట్రాఫిక్ బారికేడ్లను అందజేసింది. ఆదివారం ఆ హాస్పటల్ వద్ద జరిగిన ఓ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏడిసిపి కె. ప్రవీణ్‌కుమార్‌కి మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లోని సీనియర్ జనరల్ ఆప్తాల్మాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ రావు చేతుల మీదుగా ట్రాఫిక్ బారికేడ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బారికేడ్లు అధిక రద్దీ ఉన్న ప్రాంతాలలో ట్రాఫిక్‌ను నియంత్రించడంలో, రద్దీ సమయాల్లో రోడ్డు భద్రతను మెరుగుపరచడంలో పోలీస్ విభాగానికి సహాయపడతాయన్నారు. ఈ బారికేడ్ల అప్పగింత కార్యక్రమంలో నగర ట్రాఫిక్ ఏసిపి ఎస్. వాసుదేవ్ మరియు తూర్పు ట్రాఫిక్ సర్కిల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీను, రిటైర్డ్ ఆర్ఎంఎస్ (ఇండియన్ పోస్ట్) సి.బాబురావు రెడ్డి పాల్గొని మ్యాక్స్ విజన్ చేపట్టిన ఈ కార్యక్రమంను ప్రశంసించారు. ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాల ద్వారా ప్రజా సంక్షేమానికి మద్దతు ఇవ్వడంలో మాక్సివిజన్ ప్రయత్నాలను ప్రశంసించారు. నగరం యొక్క భద్రతకు తోడ్పడటంతో పాటుగా ట్రాఫిక్ రద్దీ నియంత్రించటానికి అంకితభావంతో కృషి చేస్తోన్న వారికి మద్దతు ఇవ్వడానికి ఇవి ఉపయోగపడతాయని అన్నారు.

విద్యతోపాటు క్రీడలూ ముఖ్యమే..

- పాఠశాలను అభివృద్ధి చేసిన సుభాష్ చంద్రబోస్‌కు సీపీ అభినందన

- కేజీబీవీలో మెగా మెడికల్ క్యాంప్, మెగా లైబ్రరీ, క్రీడా ప్రాంగణాలు ప్రారంభం

విశాలాంధ్ర - ఆనందపురం విద్యతో పాటు ప్రతి విద్యార్థీ క్రీడలోను రాణించాలని విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రత బగ్చీ కోరారు. ఇక్కడి నేలతేరులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ (కేజీబీవీ) ప్రాంగణంలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరంతో పాటు మెగా లైబ్రరీ, క్రీడా ప్రాంగణాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విశాఖ పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చితో పాటు ఆత్మీయ అతితథిగా యువ నేత గంటా రవితేజ హాజరై మాట్లాడారు. శ్రీ మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కార్యక్రమంలో సీపీ మాట్లాడుతూ సరైన నిద్ర, ఆరోగ్యకరమైన ఆహారం, నియమిత వ్యాయామం ప్రతి ఒక్కరి జీవన విధానంలో ఉండాలని సూచించారు. అనంతరం ఆయన పాత శాలలో ఏర్పాటు చేసిన వాలీబాల్, టెన్నిస్, లాంగ్ జంప్ మైదానాలు, మెడికల్ క్యాంప్, లైబ్రరీ గదుల్ని ప్రారంభించారు. ముందుగా మదర్ థెరీసా, కస్తూర్బా విగ్రహాలకు పూల మాలలర్పించారు. రవితేజ మాట్లాడుతూ. కస్తూర్బా విద్యార్థులు ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలతో అంతర్జాతీయ స్థాయి స్కూళ్లకు పోటీ పడాలన్నారు. స్థానిక నాయకులు, సేవా సంస్థలు ముందుకొస్తే కేజీబీవీల స్థాయి మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. భీమిలి నియోజకవర్గంలోని ప్రతి కేజీబీవీ స్కూల్ను దత్తత తీసుకునేలా కృషి చేస్తామని తెలిపారు. శ్రీ మహాలక్ష్మీ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు. ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ కస్తూర్బా స్కూల్ను తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో దత్తత తీసుకొని దేశంలోనే నంబర్ వన్ స్కూల్‌గా అభివృద్ధి చేయడానికి కట్టుబడి ఉన్నామన్నారు. ఇందుకోసం ఆధునిక ప్లేగ్రౌండ్, లైబ్రరీ, స్టేజీని ఏర్పాటు చేశామన్నారు. గ్రామ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన మెగా మెడికల్ క్యాంప్ ఇక్కడ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. కేజీబీవీ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, హైజంప్, వాలీబాల్, టెన్నిస్ ప్రదర్శనలు అందర్నీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఈవో (వీఎస్పీ) ప్రేమ కుమార్, సమగ్ర శిక్షా ఈపీసీ డాక్టర్ జోగి చంద్రశేఖరరావు, సీఐ వాసునాయుడు, సబ్ ఇన్స్పెక్టర్ సంతోష్ ఆనందపురం ఎంఈవో-1, 2 జోగేంద్రనాథ్. గంగరాజు, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ కోరుకొండ శివాజీ, వైస్ ఛైర్మన్ మంగా అప్పన్న, సభ్యులు దేవుడి కేజీబీవీ ఇన్చార్జి ప్రిన్సిపాల్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలపై అవగాహన వాక్

విశాలాంధ్ర- విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయం హ్యూమన్ జెనెటిక్స్ విభాగం, సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఇంక్లూజన్ సహకారంతో భిన్న సామర్థ్యం గల వ్యక్తులు (దివ్యాంగులు) ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించడానికి మైత్రి వాక్ 2.0 వాకథాన్‌ను నిర్వహించారు. కార్యక్రమాన్ని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజ శేఖర్ ఈ వాకథాన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ప్రొఫెసర్ రాజ శేఖర్ మాట్లాడుతూ దివ్యాంగులు ఎదుర్కొంటున్న వివక్షను రూపు మాపడం, వారిని సమాజంలో భాగంగా చేయడం ఎంతో అవసరమన్నారు. వారు దశావతారం కార్యక్రమాన్ని ప్రదర్శించిన విధానం ఎంతో ముచ్చట గొలిపిందన్నారు. వారిని సమాజంలో భాగం చేసే విధంగా అందరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. దివ్యాంగులను సామాజిక సమ్మిళితం చేస్తూ వారి సాధికారతకు కృషి చేయాలని సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం, కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.వి.ఆర్. రాజు మాట్లాడుతూ సమానత్వాన్ని ప్రోత్సహించడం మరియు విధానాల అమలుకు కృషి చేసే దిశగా సామూహిక ప్రతిజ్ఞగా మారుతుందని పేర్కొన్నారు. ఏలూరు జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ రాణి తన ప్రయాణంలో ఇంటి వద్ద, విద్యలో మరియు ఉద్యోగంలో తనకు బలమైన మద్దతు లభించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రూప్-1 సేవలను అభ్యసించడానికి తన ఉపాధ్యాయులు తనను ఎలా ప్రేరేపించారో ఆమె ఏపీపీఎస్సీ నిర్వహించిన వ్రాత పరీక్షలో విజయవంతంగా ఉత్తీర్ణత సాధించి 2004లో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్‌గా, 2010లో డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి పొంది, ప్రస్తుతం జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్‌గా తన స్థానాన్ని ఎలా చేరుకోగలిగిందో వివరించారు. కార్యక్రమంలో హ్యూమన్ జెనెటిక్స్ విభాగం అధిపతి ప్రొఫెసర్ వి.లక్ష్మి, డైరెక్టర్ డా.పి.సుబ్బారావు, అధ్యాపక సభ్యులు, సి ఎస్ ఎస్ ఐ సిబ్బంది, ఏయు విద్యార్థులు, పరిశోధకులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

ఐఐఎమ్ కోర్ అవార్డులను సాధించిన ఎన్ఐటీ

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ జాతీయ సాంకేతిక విద్యా సంస్థ (ఎన్ఐటీ)లోని ధాతువిజ్ఞాన మరియు పదార్థ ఇంజనీరింగ్ విభాగం 2025 సంవత్సరానికి గాను భారత లోహాల సంస్థ (ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెటల్స్ ఐ ఐఎం) అందించే రెండు ప్రతిష్ఠాత్మక ఐఐఎం కోర్ అవార్డులను సొంతం చేసుకుంది. ఈ మేరకు ఇటీవల ఐఐటీ హైదరాబాద్‌లో నిర్వహించిన ఐఐఎం ఏటీఎం 79వ వార్షిక సాంకేతిక సమావేశం సందర్భంగా ప్రదానం చేయబడ్డాయి. అవార్డుల ప్రదానోత్సవంలో ఐఐఎం అధ్యక్షుడు మరియు ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్. మూర్తి, ఐఐఎం వైస్ ప్రెసిడెంట్ (నాన్ ఫెర్రస్ డివిజన్) మరియు న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్ఎఫ్సీ) ఛైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ కోమల్ కపూర్, మరియు ఐఐఎం వైస్ ప్రెసిడెంట్ (మెటల్ సైన్స్) మరియు మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వి.ఎస్.నారాయణ మూర్తి సమక్షంలో ప్రధానం చేశారు. ఎన్ఐటీ ఆంధ్రప్రదేశ్ బెస్ట్ స్టూడెంట్ అఫిలియేట్ చాప్టర్ అవార్డు (ఐఐఎం విశాఖపట్నం చాప్టర్ అనుబంధంతో) ఈ అవార్డును ఐఐఎం స్టూడెంట్ అఫిలియేట్ చాప్టర్ ఫ్యాకల్టీ ఇంచార్జ్, ఐఐఎం విశాఖపట్నం వైస్ చైర్మన్ డాక్టర్ రఫీ మొహమ్మద్ స్వీకరించారు. ఈ పురస్కారం విద్యార్థి చాప్టర్ నిర్వహించిన అత్యుత్తమ కార్యకలాపాలు, విద్యా వృత్తి అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన, విద్యార్థి సభ్యత్వ వృద్ధికి చేసిన కృషిని గుర్తిస్తూ ప్రదానం చేయబడింది. అదేవిధంగా ఐఐఎం బెస్ట్ స్టూడెంట్ ప్రైజ్ అవార్డును జయస్మితా కె.ప్రతాన్ (బీ టెక్ 2021-25) విద్యా ప్రతిభకు గుర్తింపుగా అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రఫీ మొహమ్మద్ మాట్లాడుతూ గత పది సంవత్సరాల్లో ఎన్ఐటీ ఆంధ్రప్రదేశ్ మరియు ధాతువిజ్ఞాన పదార్థ ఇంజనీరింగ్ విభాగం సాధించిన ప్రగతిలో ఈ పురస్కారాలు ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తూ, విభాగం యొక్క విద్యా ప్రతిష్టను, పరిశోధనా సామర్థ్యాన్ని, జాతీయ-అంతర్జాతీయ స్థాయి కనిపింపును మరింతగా బలోపేతం చేశాయన్నారు. ఐఐఎం స్టూడెంట్ చాప్టర్, ఎన్ఐటి ఆంధ్రప్రదేశ్, సంస్థ స్థాపన అనంతరం ప్రారంభ దశలోనే ఏర్పడిందని, గతం నుండి నేటివరకు ఈ చాప్టర్ అభివృద్ధిలో ఐఐఎం విశాఖపట్నం చాప్టర్, రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) నిపుణులు అందించిన సహకారం మరువలేనిది అన్నారు. భవిష్యత్తులో విద్యార్థి ఆధారిత కార్యక్రమాలను మరింత విస్తృతంగా అభివృద్ధి చేయడానికి కృత నిశ్చయంతో ఉన్నామన్నారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్, రిజిస్ట్రార్, విభాగాధిపతి, అధ్యాపక వర్గం, పూర్వ విద్యార్థులు మరియు ప్రస్తుత విద్యార్థులందరి నిరంతర సహకారం, ప్రోత్సాహం మరియు నిర్మాణాత్మక భాగస్వామ్యానికి కృతజ్ఞతలు తెలిపారు.